13607

ఓం

శ్రీరామాయనమః

వెంకటేశ్వర శతకము

ఉ. శ్రీరమణీమణీహృదయన్ సీమ వెలింగెడు దివ్యమూర్తి బృం
దారకకోటిమౌళిమణిదర్పణదీపిత పాదపీఠ! యో
వారిజనాభ! యోవరద భవ్యయశస్సుఖ సంపదాళితో
మీరెడునాయువుఁ గరుణ మేకొనఁ జేయుము వెంకటేశ్వరా॥ 1

ఉ. శంకలువీడి మానస మొన్ సంగితి నీకతిభక్తితోడ నా
తంకములెల్లఁ దీర్చి ననున్ దాటఁగఁ జేయు భవాంబురాసి నీ
పంకజసన్నిభంబులగున్ పాదయుగంబును గొల్తునయ్య! యో
వేంకటశైలనాథ! నినున్ వేఁడెద నిచ్చలు వెంకటేశ్వరా॥ 2

ఉ. పాపములేని సంసరణ భారముఁ బూని తొలంగఁజాల కే
దారియటంచుఁ బల్మరు నిన్ దాసముగామదినిల్పి యోజనం
బారగసల్పి కాంచక ప్రభన్ మూకుల చిత్తఁ జైత్రినింక నా
భారమునీవె తాల్చి ననున్ పాలనసేయుము వెంకటేశ్వరా॥ 3

ఉ. నమ్మితి నీపదంబులనున్ నాదగుసంకట సంచయంబులన్
వమ్ముసరించి నీవిమలన్ భవ్యమనోజ్ఞసురూప దర్శనం
బిమ్ము నిరంతరంబు భవన్ బీజములన్ మొలకెత్తనీక స
త్యమ్ము సుఖాస్పదమ్మగున్ దారినొసంగుము వెంకటేశ్వరా॥ 4

ఉ. ఆపదలెల్లఁ బాపి కరుణన్ నార్తిని నీనిజభక్తకోటికిన్
బ్రాపయినిల్చి కామ్యములన్ వారికనిచ్చెడుకల్పశాఖియుం
జేపడెబుద్ధిలోన నదిన్ చేరిచి భక్తిరసాన పెంచెదన్
శ్రీపతి యెట్లుకాచెదవొన్ చిన్మయరూపక! వెంకటేశ్వరా॥ 5

చం. చదువఁగలేను శాస్త్రములు సల్పఁగలేను తపంబు దానముల్
మొదలెవియున్ శక్తి; రిత్త శమముల్ దపముల్ రిపునిగ్రహంబు నీ
పదములనమ్మినాఁడ సురపాదప! లోపములెన్న కార్తులన్
వదలిచి చేరదీసి నను వారక ప్రోవుము వెంకటేశ్వరా॥ 6

ఉ. కొండలు మూఁడునాల్గుదరిఁ గూడ నివాసము చుట్టు శైలముల్
మెండుగ కోటగోడలుగ మేకొని దుర్గమమై జనాళి కు
ద్దండభరంబు గూర్పఁగ సతంబును శోధన చేసి భక్తులన్
దండిగఁ బ్రోచు దేవుఁడ వుదారత తిర్పతి వెంకటేశ్వరా॥ 7

ఉ. ఇమ్మహిఁ గల్గు తీర్థముల కెల్లను మేటియటంచు పాపనా
శమ్మను పుణ్యతీర్థమున స్నానమొనర్చి విశుద్ధులై త్వదీ
యమ్మగు పాదపద్మముల నారసి నమ్మిన జేర్చు భక్తుల
బ్రమ్మఁగ నీపదంబు నను వారక నిల్తువు వెంకటేశ్వరా॥ 8

ఉ. శక్తికొలంది నీసుగుణ సంచయమున్నుతియించువాఁడ
నా సూక్తులఁ గల్గు లోపముల శోధనఁ జేయక పుత్రుఁడై వడిన్
భక్తునిలఁ గైకొనఁగ ప్రార్థనఁ జేసెద చిత్తగింపుమో
భక్తశరణ్య! యోగిజన భావసమాశ్రయ! వెంకటేశ్వరా॥ 9

ఉ. సోమకుఁడన్సురారియటు చోరత వేదములన్ హరింపఁ బ్ర
హ్మామరకోటి చేడ్పడి మహాపదఁ బాపఁగ నిన్ను వేఁడ నీ
వామిఁక మత్స్యరూపమున నాతనిఁ జీల్చి శ్రుతుల్ గ్రహించితో
కామితదాయి! నీపదయుగంబును గొల్చెద వెంకటేశ్వరా॥ 10

ఉ. మున్ను సురాసురుల్ గలసి మోదమునన్ తరిమందరంబుగా
పన్నగనాథుఁ ద్రాడుగను పన్ని పయోనిధిఁ ద్రచ్చఁబూనగా
గ్రన్నన శైల మబ్ధిమునుఁగంగ మఠాకృతిఁబూని వీపుపై
తన్నగ ముందరించితి వుదారత తిర్పతి వెంకటేశ్వరా॥ 11

ఉ. రాక్షసవంశవార్నిధికి రాజితమౌ బడబాగ్నియౌ హిర
ణ్యాక్షుఁడు జీవకోటికడు నాపదఁ జెందఁగ భూమిఁ జుట్టఁగా
నాక్షణమే వరాహమయి యాతని గూల్చితి విక్రమంబునన్
బక్షికులేశవాహ! నినుఁ బ్రస్తుతిఁ జేసెద వెంకటేశ్వరా॥ 12

ఆదటవిష్ణుభక్తి యుతుఁ డౌదితిజేశ్వర సూనుఁడైన ప్ర
హ్లాదుని పెక్కుభంగుల సురారిదయారహితాత్ముఁడై స్వభా
వోదితదుష్టబుద్ధిఁగడు నొంపఁగ నీవు నృసింహమూర్తివై
యాదితిజున్ హరించితివి యుబ్బరమానటు వెంకటేశ్వరా॥ 13

ఉ. దానగుణంబునందు బలి దైత్యునిఁ బోలినవానినెందు నే
గానమటంచు ముజ్జగము గారవమొప్పనుతింపరాజ్యమున్
బూనిన వామనాకృతిని మూడుపదంబుల వేఁడి లోకముల్
బూనికనాక్రమించితివి భూరిగుణాకర వెంకటేశ్వరా॥ 14

చం. జగతిఁగలట్టిక్షత్రియ సుగుంతతి నిర్వదియొక్కమారు శౌ
ర్యగతి విరాజితోగ్రతఁగ రాసివధించి తదీయ రక్తమం
దోగి పితృదేవ తర్పణము నొప్పఁగఁజేసితి భార్గవాఖ్యతో
నగునె నుతింప నీకథలు హారిమృదూక్తుల వెంకటేశ్వరా॥ 15

ఉ. కోసలకన్యగర్భమున కూర్మిజనించి వసుంధరాసుతన్
వాసిగపెండ్లియై దనుజ వారముసంహరణం బొనర్పగా
జేసిప్రతిజ్ఞ దండకను చేరిచతుర్దశహాయనంబులన్
జేసితిదుష్టశిక్ష రఘుశేఖర తిర్పతి వెంకటేశ్వరా॥ 16

ఉ. దేవకిగర్భమందు వసుదేవునకున్ సుతుఁడైజనించి లో
కావనదీక్షఁ గైకొని యఖండపరాక్రమమొప్పఁ బల్వురన్
దేవవిరోధులన్ దునిమి తీర్చితి భూభరమాత్మతత్త్వమున్
వావిరి పాండుసూనునకు భవ్యతఁదెల్పితి వెంకటేశ్వరా! 17

ఉ. యాదవవంశమెల్ల మరి యాదకనం బలరాముడంచు పే
రూది యరాతివర్గము మహోగ్రముగావధియించి లోకముల్
మోదముఁజెంద విక్రమము బూనితి సంగరమందు భక్త స్వః
పాదప! నిన్నుఁగొల్చెదను భక్తజనప్రియ వెంకటేశ్వరా॥ 18

ఉ. బుద్ధుడనంగఁ బేర్వడసి భూమినికల్గిన ప్రాణికోటిలో
వృద్ధుల రోగులంగని భరింపగరాని విచారహేతువా
పద్ధతిమాన్ప ముద్దుసుతు భార్యనువీడి వనంబుఁజేరి లో
కోద్ధరణంబొనర్చితివి మోగ్యమతంబున వెంకటేశ్వరా॥ 19

ఉ. ధర్మవిహీనవర్తనుల దండనసేయఁగ లోకసంచయం
బర్మిలిరక్షసేయఁగలి కాకృతిమానవరూపమొంది స
త్కర్మలఁ బ్రోత్సహించి జన కాండముఁ బ్రోచెద వార్తరక్షణా!
నిర్మథితారి! నీచరణ నీరజముల్ విడ వెంకటేశ్వరా॥ 20

ఉ. పరులధనంబుఁ గోర పర భామలఁ గోరను స్వీయలబ్ధితో
జరపెద కాలమున్ పరుల సాయముఁ గోరక నీపదంబులే
నిరతము నమ్మి కొల్చెదను నేరను చేయ పరాపకారమున్
కరుణఁదలిర్ప నన్నెటుల గాచెదవో గద వెంకటేశ్వరా॥ 21

ఉ. నాలుగుమోములన్నలువ నాగవిభుండటు వేయిమోములన్
జాలరు నీగుణంబులను సన్నుతిసేయఁగ నష్టచిత్తుఁడన్
బాలుని నీల నానుతుల మన్ననఁజేసి కటాక్షవీక్షలం
జాలగఁ బ్రోవుమయ్య నిను సన్నుతిఁజేసెద వెంకటేశ్వరా॥ 22

చం. నిరతము పాపచింతనల నెమ్మదిఁ జేర్చి దుష్టచేష్టలం
గరమనురక్తిఁ జేసి తమ కాలము బుచ్చుచు నన్యవిత్తముల్
దరచుగ సంగ్రహించుచును దారసుతాదులఁ బ్రోచు దుష్టుల
బ్బురముగ పెద్ద తైరిసుర పూజిత తిర్పతి వెంకటేశ్వరా॥ 23

చం. నిరతము సత్ప్రవర్తనను నెక్కొని ధర్మపరైక కార్యముల్
నెరపుచు వాఙ్మనఃకరణ నీమముతో నరిషట్కమున్నిరా
దరణ మొనర్చి భక్తిలతఁ దన్పుచుఁ బ్రేమరసంబుతోడ నీ
చరణము లాశ్రయించెదను సాధుజనప్రియ వెంకటేశ్వరా॥ 24

చం. కరమనురక్తి నీచరణ కంజములన్మదిఁ జేర్చి భక్తితో
నిరతము నామకీర్తనము నేనొనరించెద పాపపుంజముల్
దొరగగఁ జేసి సద్గతిని తూర్ణమొసంగుము సర్వనాథ నా
భరమది నీవశంబెసుమి పావననామక వెంకటేశ్వరా॥ 25

ఉ. దారసుతాదులందఱు సదా తమ లాభముఁ గోరి పెక్కులా
కారణముల్ నిరంతరము గల్పనఁ జేయుచు ద్రవ్యవాంఛచే
మీరినకోర్కెలన్ మిగుల మేకొనివంతను గూర్తురిట్టి సం
సారమసారమంచుఁ గన జాలరు లోకులు వెంకటేశ్వరా॥ 26

పెక్కుతెరంగులౌ వెతలు బిట్టుగఁ గల్గినఁగాని నిత్యముల్
జిక్కులతోడ మానసము చిందరవందర యౌచు డీల్పడన్
దిక్కరిమాధ చిత్తులగు దీనులు నీదెసఁ గాంచజాలరా
మ్రొక్కులువెట్టి లోకములఁ బొందెదరో గద వెంకటేశ్వరా 27

ఉ. వారణనాథుఁడా మకరి వల్లభుబారికిఁ జిక్కి సంతతం
బారనివంత చేఁబడలి భావమునీపద కంజయుగ్మముల్
జేరిచి నిన్ను జీరవడి జేరి మహాపదఁ బాపి శాశ్వతం
బౌ రమణీయ సత్పదము నాతనికిచ్చితి వెంకటేశ్వరా॥ 28

ఉ. హేల ననేక దుష్కృతము లెల్లపుడుం బొనరించు నా యజా
మీళుడు చావుకాలమున మిక్కిలి ప్రేమను నీదు నామముం
బోలిన నామముం గలుగు పుత్రుని బిల్వగ వాని పాపముల్
దోలి యనుగ్రహించితివి దోయజలోచన వెంకటేశ్వరా॥ 29

ఉ. నీసుచరిత్రముల్ వినుచు నీపదయుగ్మమె నమ్మి కొల్చుచుం
వాసిగ నీకథల్ బలుకు వారలె కా భవదీయదాసు లా
దాసుల దాసుఁ జన్మదనికి దాల్చితి నీపదకంజభక్తి నో
వాసవవందితాత్మపద! వారిజలోచన వెంకటేశ్వరా॥ 30

చం. సతతము కూటసాక్ష్యముల సల్పుచు లోకుల వస్తుజాలముల్
సతులనుగొంట; యాత్మనుతి వైరణ లేమి పరాపవాదముల్
గతులుగ నిత్యజీవనము గాంచెడు మూర్ఖులె మాన్యులైరి యే
గతి భవదీయ దాసులకు గల్గనెయీ కలి వెంకటేశ్వరా॥ 31

ఉ. నీపదసేవఁ జేయు మహనీయులు లౌకిక వాంఛలన్నిటిన్
రూపరఁ జేసి ధర్మగతి లోపము లేని విశుద్ధవర్తనం
బాపక లేని జీవనము నార్తి నెఱుంగని మానసంబులో
తాపములెల్లఁ బాసెదరు వంచితశా తవ వెంకటేశ్వరా॥ 32

ఉ. కాపురుషుండు లౌకిక సుఖంబులఁ గోరి నిరంతరంబు చిం
తాపరుడై పరార్థముల నాసయొనర్చి యధర్మవర్తనుం
డై పరకాంతలన్ గవియ నారయుచుండు పరేతరాట్పురిన్
జేపడు యాతనల్ మదిని చింతయొనర్పక వెంకటేశ్వరా॥ 33

చం. నిరతము నీపదంబులను నెమ్మదిఁ జేర్చి భజించుమానవుల్
బరువడి పూర్వజన్మ భవ పాతకకోటులఁ బాసి వేడ్కతోఁ
జిరముగ పుణ్యలోకములఁ జేరినిరంతర సౌఖ్యసంపదం
బరగుదు రబ్ధిజాహృదయ వారిజభాస్కర! వెంకటేశ్వరా॥ 34

ఉ. దారసుతాదికంబగు పదార్థములెల్ల నిరంతరంబు సం
సారమహాబ్ధిఁ ద్రోపిడగఁ జాల సమర్థములౌటఁగానకే
పారెదు లోభమోహగుణ వారముపాల్పడి మూఢమానవుం
డోరమణీయమూర్తి! నిను నోర్వడుకానగ వెంకటేశ్వరా॥ 35

ఉ. వేకువనిద్రలేచి నిను బెక్కువిధంబులఁ బ్రస్తుతించి ని
ర్వ్యాకుల వృత్తికల్యముల సత్క్రిలఁ జేసి స్వధర్మరక్షణా
స్తోకమతింధనార్జనము చొప్పడధర్మవిరుద్ధ వర్తనల్
పోకడబెట్టి జీవితము పుచ్చుబుధాగ్రణి వెంకటేశ్వరా॥ 36

చం. కరుణదలిర్ప మానవుల కష్టములం దొలగించి కావ నే
ర్పరివిక దయ్య యట్లగుట భక్తిభజించెద నన్యచింతలన్
మరచి నిరంతరంబు కను మాయనుమానము వీడి భక్తవర్
పరమదయాంతరంగమున బ్రాపునొసంగుచు వెంకటేశ్వరా॥ 37

చం. దురితములెన్ని చేసినని దోసములెంచక బాలురీతి నా
భరమువహించి సంతతము పాపవిదూర సువర్తనంబున
న్నిరతము నీపదద్వయ ని నిర్మలభక్తినొసంగి ప్రోవ నా
తురత వహింపుమయ్య బుధతోషణ! తిర్పతి వెంకటేశ్వరా! 38

ఉ. తండ్రి! మదీయమానసము దార్చెద నీపదపంకజద్వయిన్
గండ్రతనంబు మాని నను గారవమొప్ప పరిగ్రహించుమో
తండ్రులకెల్ల తండ్రియును దైవము నై నిలసిల్లుదేవ! నా
వంద్రలు తీర్చి సంతతము వారిజలోచన! వెంకటేశ్వరా॥ 39

ఉ. ఇంద్రియవర్గ మెంతయు న హీనబలంబున దుర్గుణాళితో
సాంద్రముగా పెనంగొని వి శంకటవృత్తిని మానసంబునన్
తంద్రమొనర్చు నిశ్చలత దాకొననీయక సంతతంబు ని
స్తంద్రతఁ గూర్పుమయ్య నిర తంబుభజించెద వెంకటేశ్వరా॥ 40

…నఁగలట్టి భోగములఁ బొందఁగఁ గోరి విమూఢవర్తనుం
డవిరతయత్నముల్ సలుపు నాదృతిమానఁడు లాభకాంక్షచే
దివిరియశాశ్వతంబయిన దేహము నెంచక నీపదాబ్జముల్
దవిలి భజింప నేర్చునెటు తాపసవందిత! వెంకటేశ్వరా॥ 41

చం. కరమనురక్తి భార్యను గాదిలిపుత్రులకుం హితంబు చే
కురుటకుగా ధనంబు వడిఁ గూర్చును, యౌవనమేగ వార్ధకం
బిరువుకొనన్ శరీరమున మృత్యువు సన్నిహితంబుగాఁగ పా
మరుఁ డెటు దిక్కులేక వెతఁ బ్రూన్పుడు తిర్పతి వెంకటేశ్వరా॥ 42

ఉ. దేహముఁ గంపు ప్రాణములు తీరుగ నుండిన యంతపట్టు సం
దేహము మాని నీచరణ నీరజయుగ్మము పూనికొల్వగా
మోహలతాలవిత్రమగు ముక్తిపథంబును గానవచ్చుగా
దేహరి! నీకృపాగరిమ దెన! సురార్చిత! వెంకటేశ్వరా॥ 43

ఉ. తాపసవందితా! ప్రవిధి తాపములం బరిమార్చి మానసం
బోపిక నీపదాబ్జముల నూని భజింపఁగ నీకటాక్షముం
జూపుమనన్యభక్తి నిడి చుట్టము నిక్కము తల్లిదండ్రి నీ
వే పరమాత్మ! లేరొరులు విశ్వజనప్రియ వెంకటేశ్వరా॥ 44

ఉ. నమ్మితి నుల్లమందున సనాతన మా భవదీయ తత్వమున్
జిమ్మితి నాత్మ నొప్పులఁ జిందిరవందరగాఁ భక్తితో
గ్రుమ్మితి నిత్యమై చెలఁగ కోరిక లేరిక లెత్తె; నీదులో
కమ్మున జేర్చి శాశ్వత సుఖంబొసఁగంబడు వెంకటేశ్వరా॥ 45

ఉ. అబ్బురమయ్యె నీపద సరోజము శ్రేయమగా వినమంది కోతి దా
గొబ్బున దాటె సంద్రము నకుంఠిత వేగమునన్ మహాబ్ధిలో
ద్రొబ్బఁగఁ గుండ్లు బెండ్లగతిఁ దూర్ణము తేలెను మానుషాదులన్
ద్రవ్వివనౌకసాళి శిలఖండంబుల పై వడిఁ బిల్కు మార్చె నో
యబ్బ! త్వదీయశక్తి ననయంబు నుతించెద వెంకటేశ్వరా॥ 46

ఉ॥ గంధములోన కప్పురముఁ గల్పినయట్లు సువర్ణభూషలం
బంధమొనర్చి రత్నములఁ బ్రాపునొనర్చినయట్లు సాధుసం
బంధముకల్గు మర్త్యునకు భవ్యగుణంబులు చేరినట్లుగా
బంధురమైన పాండితిని భక్తి నినాకిడు వెంకటేశ్వరా॥ 47

ఉ. గర్భమునందుఁ జేరి పలు కష్టములం దురపిల్లి యార్తితోఁ
దుర్భరవేదనల్బడి యథోచితరీతి తరించి స్వేచ్ఛమై
నర్భకుఁడై వివేకమును నారడిపెట్టును మానవుండు గా
స్వర్భువనా! భవాబ్ధితరివై కరుణింపుము వెంకటేశ్వరా॥ 48

ఉ. నేరని బాలునిం బ్రియము నెక్కొనఁ దల్లి నిరంతరంబుఁ దా
బేరిమిబుగ్గలం గరపి పెన్దయొనర్చెడిరీతి నాకు నీ
కారుణికత్వ మొప్పగు నగాధతమంబు తొలంగఁ జేసి పెం
పారెడు జ్ఞానలేశ మిడుమయ్య దయాంబుధి! వెంకటేశ్వరా॥ 49

ఉ. చేష్టయు మంచియుం దెలియఁ జెంతయొనర్పక యెప్పుడేది చే
సడ్డ నదెల్లఁ జేయుచును బాలునివై నడి, మూర్ఖపోలికం
గ్రుడ్డితనాన కాలమును గూర్చితి యౌవనమేగె వార్ధకం
బొడ్డెను దిక్కు నీవనుచు నుంటిని కావుము వెంకటేశ్వరా॥ 50

ఉ. ఆయువులోసగంబు వృథ యౌచు నమాత్రులనిద్రతో నెను
ప్రాయమునందు కొంతయును వార్ధకమందునఁ గొంతబోవు నా
ప్యాయముగాగ నీవిమలభవ్యమనోహర నామకీర్తనం
బాయతిఁ జేయనైతి నెటులారసి కాచెదొ వెంకటేశ్వరా॥ 51

ఉ. పాయని చింతసంసరణభారము నా శిరమందు నిల్చి నీ
జాయను విష్ణలన్మనుపఁ జాలెడు పుష్కలసాధనంబు నే
చాయ లభించు నంచనెడి చాలవిచారము యౌవనంబునం
బాయదు నీపదాబ్జయుగ భక్తిని బాపుచు వెంకటేశ్వరా॥ 52

ఉ. కాయము కల్గినందులకు కాంతలఁ బుత్రుల రక్షసేయుటా
శ్రేయము? ఇంతకంటెమును జెందితి నెన్నియొ దేహసంచయం
బీయెడఁ గల్గినట్టి తనుపిద్దియు నంత్యమె కాక శాశ్వతం
బే? యనఘాత్మ! యొల్లనిక నీభువి పుట్టువు వెంకటేశ్వరా॥ 53

ఉ. కొండలవంటి పాపములు కూలు భవత్కమనీయకీర్తనా
ఖండమహత్వశక్తిని బ్రకామసుఖానుభవాప్తి రేకముల్
మెండుగఁ గల్గు నీవిమలమేచకరూపముఁ గాంచి నంతనే
అండజవాహ! నిన్ను ననయంబుఁ భజించెద వెంకటేశ్వరా॥ 54

"నారు పోసినీరిడడె?" నా జనసూక్తి నిజంబు కాదొ? యా
ధారుణి జీవకోటి నియతంబుగ సృష్టియొనర్చినట్టి యా
ధీరుడు తున్ని వారణకు తేకువ నన్ను మొసంగడే? మనో
భీరుత కాదె పొట్టకయి వెంపరలాడుట వెంకటేశ్వరా॥ 55

ఉ. స్థావరజంగమాత్మకపదార్థచయంబఖిలంబు నీవిలా
సావహమై చెలంగుట నిరంతరముం గనఁజాలకే నరుం
డావిలమానసుండగుచు నర్థముఁ గూర్చును పొట్టకూటికై
యీవిధి జంతుకోటిఁ గన నెవ్వరిఁ దిర్పతి వెంకటేశ్వరా॥ 56

ఉ. రాతన నించు కప్పఁ గనరాదె నిరంతర మా మహాస్థిలో
బ్రాణిగ నిల్చు జంతు నికరంబది కాంచదె యన్నమట్లు ని
ర్భీతిగఁ బోషణ శ్రమముఁ దాల్చుగఁ బూనక సర్వభారముం
నీతల నిల్పికొల్చెదను నిత్యసుఖప్రద! వెంకటేశ్వరా॥

ఉ. ఉడుతయదెంత? నీరనిధి యొడ్డున నిల్చి కపివ్రజంబు దా
బడబడ వార్ధిక మిగుల పర్వతఖండములు వైచి సేతువుం
వడివడిఁ గట్టుచుండఁగని భక్తిని సైకతమంటు కొన్న యా
యొడలి విదిర్చెనంట యదియుం జలరాశిని వెంకటేశ్వరా॥ 58

ఉ. పండితలోకగమ్యము సుభాషిత రత్నపరీతమర్థస
త్ఖండరసప్రకర్షము సుఖస్థిరపా కవితామృతాబ్ధి ను
ద్దండతఁ దేలఁగల్గుటకు దైర్యమొసర్చెదె భక్తిసాకనా
దండను గల్గ; భక్తజనతావినుతాశ్రయ! వెంకటేశ్వరా॥ 59

ఉ. అంబుజనాభ నీపదసమాశ్రయణంబది ఘోరపాతకో
ద్దండజనాళి దానహవనాధికసంపరిదగ్ధహేతువై
చెండదె మోక్షసంచయముఁ జిత్తవినిర్మల భక్తిభావము
క్కుండుదయించదే యనలకంజవిలోచన! వెంకటేశ్వరా॥ 60

చం. హరిహయుచూడ్కికిం బడినయట్టియహల్యని జేశు శాపముం
బొరసి శిలాత్వమున్గని విముక్తిని జయ్యనఁ గాంచఁజాలకే
పరితపియించుచున్న తరి పాదరజంబున దానినాతిగా
బరపితివబ్బురంబు తమ ప్రాభవమెన్నగ వెంకటేశ్వరా॥ 61

ఉ. కాకమురూపుందాల్చి యొకకట్టిడిరక్కసుఁడా ధరాత్మజా
స్తోకకుచాగ్రభాగమున తుంటరియై తనముక్కుతోడ బ
ల్వీకను దాఁకుచుండఁగని పీచమడంపగ గడ్డిపోచనే
ప్రాకటధాతృబాణమటు రాజిలఁ జేసితి వెంకటేశ్వరా॥ 62

చం. కరిపతినిన్ విభీషణుని గౌతమపత్నిని బోయకాంతనున్
సురరిపుసూతినిన్ రవికిశోరమునున్ విహగాధినాథునా
సురపతిపుత్రినిన్ గరుణఁ జూపుచునేలిన నీకటాక్షముం
బరపుము నాపయిన్మిగుల భక్తినుతించెద వెంకటేశ్వరా॥ 63

చం. కఠినచరిత్రు బోయనొక కావ్యసుకర్తను చేసి పేర్మి త
త్పఠనము సర్వపాపచయవారకమై తగనీవు సత్కథల్
లుఠదమృతోక్తుల న్వెలయ లోకవిమోహన! చేసినావు కా
మఠవిలసత్స్వరూప! కనుమా పెరిమంబున వెంకటేశ్వరా॥ 64

ఉ. కారియఁబెట్టు సంసరణగాఢతమంబు భవత్పదాబ్జప
స్తారదినాధినాథ నిరత పధితప్రతిమానిహీన తే
జోరమణీయదర్శనము చొప్పడ దూరముగాఁ దొలంగదే
వారిజగర్భనందిత విభాస! జగద్ధిత! వెంకటేశ్వరా॥ 65

ఉ. క్షీరము నీరముంగలసి చెన్నలరారగ హంసమందు లో
నీరమువీడి క్షీరమును నిచ్చలుతాగ్రహియించు పోలికన్
దారుణపాతకంబులను దాఁకలనీ పనుల్లవీడి పు
ణ్యోరుకృతుల్ పొనర్చు సుకృతి దయఁ జెప్పుడు వెంకటేశ్వరా॥

చం. తిరుమల స్వర్ణశైలముగఁ దివ్యమహీరుహపంక్తి చందనో
త్కరముగ స్వర్ణపూర్వముఖరైనతవాహినికాగ వైష్ణవుల్
సురతతికాగ పద్మభవచోద్యముగా నలమేలుమంగయై
పరగనిజాశ్రితాళిఁ బరిపాలనసేయుదు వెంకటేశ్వరా॥ 67

చం. తిరుమలదర్శనంబునను తీరును పాతకకోటి కొండలన్
దిరుగగ శేషశైలమున దివ్యఫలాప్తి రహించుగోవెలం
బొరసిన భస్మభూషణ విభూషితునీరమణీయమూర్తిఁ దా
నరుసమునంగసంగనగు నాతడు ధన్యుఁడు వెంకటేశ్వరా॥ 68

ఉ. పుష్కరిణీజలంబులను మోదముమీరగ స్నానమాడి తా
నిష్కపటాత్మ నీచరణ నీరజముల్ మదినిల్పి భక్తితో
శుష్కవిచారముల్ విడిచి చూడ్కులు నీదరిఁ జేర్చి కొల్చినన్
ముష్కరమైన పాతక సమూహము తీరును వెంకటేశ్వరా॥ 69

ఉ. పాహి నిలింపనాథ! సుకృపాజలధీ! జలజాయతాక్ష! యీ
గ్రాహము నన్ను పట్టి కడుఁ గారియంబెట్టెడి జాలఁ బక్షిరా
డ్వాహ! మదీయబంధనముఁ బాపి నిరంతర సౌఖ్యమిమ్ము సం
దేహము వీడు మన్న కరి నింగరుణించితి వెంకటేశ్వరా॥ 70

ఉ. నాతరమా నుతింపనిను నవ్యసుధారస నారదపితా
త్యాతతకాకలీనినద దర్శితకోకిల గానమాధురీ
పూతమరందబిందుచయ భుక్తి నిరంతర గీతికావినో
దాతతభృంగికా నిరద హారివచో విధి వెంకటేశ్వరా॥ 71

ఉ. ప్రస్తుతిఁ జేసెద నిర్మల భవ్యమనోజ్ఞ విలాసవాక్య వి
శ్వస్తవనీయ కావ్యచయ సంభృత పద్యములన్ బుధాళికిన్
నిస్తుల మోదముల్లసిల నేర్పును కూర్పును సొంపుఁ గల్గ భ
క్తస్తుతిపాత్ర! కరుణఁ గాంచుము తిర్పతి వెంకటేశ్వరా 72

ఉ. నిండుమనంబు నీచరణ నీరజషట్పద మట్లొనర్తునే
దండమహావిపద్గిరివిదారణశంబ! దురాత్మదానవప్రా
ద్దండతమః ప్రభేదన ధామనికోటి సమానతేజ! నీ
దండయొసంగి బ్రోవనిదె దండముఁ గైకొను వెంకటేశ్వరా॥ 73

ఉ. పద్మభవాదివందిత సుపాద! సుధాబ్ధిని శేషశాయివై
పద్మయు భూసతీమణియు భక్తి భజింపగ స్వీయనాభి నా
పద్మజుఁ గాంచి లోకముల భద్రముగా సృజియింపఁ జేసితో
పద్మదళాక్ష! నాహృదయ పద్మముఁ జేరుము వెంకటేశ్వరా॥ 74

ఉ. ఆప్తుల బంధు సంచయము నాలును బిడ్డలవీడు చింత, సం
ప్రాప్త ధనాధికంబు నెపుడు బాసెడి చింత, శరీరయాత్ర సం
క్షిప్తమటంచు చింత, మదిఁ జిందరవందర చేయుఁ నాత్మ సం
తప్తముగాగ మృత్యుముఖ దర్శన మాతరి వెంకటేశ్వరా॥ 75

ఉ. దుర్భరగర్భవేదనలఁ గ్రుంగుచు పూర్వభవార్జితాఘ సం
దర్భములెల్ల మానస పథంబున నెంచుచు సంతపించి తా
నర్భకుఁడై భువిం జననమంది తలంపఁడు మానవుం డహో
స్వర్భవనా! త్వదీయపదసారసభక్తిని వెంకటేశ్వరా॥ 76

ఉ. పూర్ణిమనాటి చంద్రమునిఁ బోలిన నీముఖమండలంబు నే
వర్ణన సేయగల్గగల భాగ్యము నాకెటు లబ్బు సంతత
స్వర్ణగిరీంద్ర ధన్వికిఁ బొసంగునుగాక, త్వదీయరూపమున్
దూర్ణమెచూపలేవటర తోయజలోచన! వెంకటేశ్వరా॥ 77

ఉ. అద్రిసుతాధినేత తనయర్ధశరీరిణి కోరినంతనే
భద్రముగా నొసంగిన ప్రభావసమన్వితమంత్రరాజము
న్నిద్రత నే జపించి భవసింధు దాటఁగ నిచ్ఛగించితో
భద్రగిరీశనామ నవిబాలన సేయవె వెంకటేశ్వరా॥ 78

ఉ. ఆంద్రుని బిడ్డలాప్తులును నర్థములై దరిఁ జేరి సల్మరున్
తీంద్రమొనర్చి చేపసినఁ దిక్కనుచూపకఁ బాయుచుండరా
గంద్రతనంబు మానసముఁ గారియ పెట్టిడి దిక్కు నీవె నా
తండ్రియుతల్లియున్ గురుఁడు దాతవుత్రాతవు వెంకటేశ్వరా॥ 79

ఉ. ధర్మము నాల్గుపాదములఁ దార్కొను నా కృతయుంగు; త్రేతయం
దర్మిలి మూడుపాదములనయ్యెఁదు; ద్వాపరమందు రెండుగాఁ
బేర్మిగనుం జగంబునను బిట్టుగ నీకలి నొక్కపాదమై
శర్మముఁ గాంచె, సత్పురుషసంఘము నేల్పవె వెంకటేశ్వరా॥ 80

ఉ. చెప్పఁగలేను నీచరిత చెప్పినమాటలు చెప్పకుండ నా
తప్పులనొప్పులంచు మదిఁ దార్కొనఁ జేసి నుతించనిమ్ము మా
యప్ప! దయారసంబు ననయంబును నాపయిఁ జిల్కఁ జేయుమో
యొప్పులకుప్ప! జాలమిక నోర్వను తిర్పతి వెంకటేశ్వరా॥ 81

ఉ. కర్మలు జ్ఞానదాయకము గా మదినెంచక తద్విధానమే
శర్మమటంచు బోఁదలచి జాలగ బ్రహ్మవిచారమెప్పుడున్
నిర్మమతన్ దలంచఁడు వినీతిని పామరుఁడజ్ఞుఁడై విని
షట్కర్మత గీత చెప్పదె గజప్రభురక్షక! వెంకటేశ్వరా॥ 82

బ్రాహ్మముహూర్తమందు హరిభక్తి నుతించుచు నిద్రలేచి స
ద్బ్రాహ్మణవంశనిష్ఠిత సదాకరణంబులఁ బ్రొద్దుపుచ్చుచున్
బ్రాహ్మియుపాసనంబు నెడబాయక చేయుచునుంటి మాధవా!
బ్రహ్మముఖాఖిలత్రిదశవందిత! తిర్పతి వెంకటేశ్వరా॥ 83

చం. దురితవిదూరవర్తనము దోషవిహీన మనఃప్రవృత్తి, దు
ర్భరమునుకాని జీవనము రాజసమొప్పని సత్ప్రవర్తనం
బరులని వేడఁబోవని గృహస్థితి నారడిపాలుగాని స
చ్చరితము, నాకొసంగు నినుఁ జాలనుతించెద వెంకటేశ్వరా॥ 84

ఉ. ఆకలిలేని భోజనము నారడిపాలగు వర్తనంబు ని
ర్భీకతలేని శౌర్యము విభేదనతంత్రము లేని మంత్రముల్
వాకులులేని నోరు రసవర్గమెఱుంగని జిహ్వ, మానసం
బాకులమైన నిద్రవృథయాగద తిర్పతి వెంకటేశ్వరా॥ 85

ఉ. నీపదభక్తిలేని జపనిష్ఠయుఁ నాసనశుద్ధిలేని లో
చూపును శాంతిలేని మనసున్ ఫలితంబు నొసంగనేర వీ
యాపదలం దొలంచి సకలార్థములంగననీదు భక్తియే
ప్రాపుగదా మదిందలప భక్తజనప్రియ వెంకటేశ్వరా॥ 86

ఉ. చిత్తము నీపదాబ్జయుగ చింతనమందు, కరంబు లెంతయున్
బత్తిత్వదీయపూజనల పాదములొప్పగ సనివాసమున్
హత్తుటయంద, వాక్కులనయంబు గుణావలివర్ణనంబునం
దత్తరపాటులేక నిరతంబును కూర్చెద వెంకటేశ్వరా॥ 87

ఉ. శబరినిరంతరంబు నిను జాలనుతించి తరించలేదె యా
యబల యహల్య నీపదపరాగముసోకిన రూపుగాంచదే
ప్రబలవిరోధముట్టఁగ నిభప్రభుఁడాదట ముక్తిగాంచడే
నబలుఁడ నిన్ను వేడితి కటాక్షమొసంగుము వెంకటేశ్వరా॥ 88

ఉ. తల్లియుఁదండ్రి దైవమును దాతయు నీవని భక్తితోడ నీ
పల్లవసన్నిభంబులగు పాదములన్మదినిల్పి యన్యముల్
పొల్లుగఁగాంచి సంతతము పూజలొనర్చెద చిత్తగింపుమీ
కొల్లగ నీదయారసముఁ గూర్చుతిరంబుగ వెంకటేశ్వరా॥ 89

ఉ. చింతఁదొలంచి యన్యమును చేరగనీయక నామనంబు నీ
పొంతనునిల్పి భక్తిఁగడు పూజలొనర్చుట నాకువంతు నా
వంతల పారద్రోలి నిరవద్యసుఖంబిడ నీకువంతు నే
పంతము మీరకొల్చెదను భక్తసురద్రుమ! వెంకటేశ్వరా॥ 90

ఉ. చెప్పగరాని దోసములఁ జేసితి నేన్నిటో యవ్వనంబునన్
దెప్పరమై నవార్థకము ద్రిక్కఁగఁజేసె మదీయదేహమున్
ముప్పుఘటిల్లె నేనిటుల మోసముఁజెందితి గాసిఁ బాపిమా
యప్ప! త్వదీయభక్తుఁడను న్యాయముచేకొన వెంకటేశ్వరా॥ 91

చం. తనువున దుర్బలత్వమది దార్కొనె, నోటనుపండ్లుడుల్లె నిం
కనుమనమందు నాశయను గాఢపిశాచముపీడఁబోదు పా
వనమగు నీపదాబ్జయుగ భావననిత్య శుభంబుఁగూర్పదే!
వనజభవాదివందిత! శుభప్రద! తిర్పతివెంకటేశ్వరా! 92

చం. తనువిది శాశ్వతంబనుచు దారసుతాదికమెల్ల నిత్యమం
చనవరతంబు లౌకిక సుఖాదిక వాంఛలఁ మానసంబులోఁ
గొని భవదీయచింతనముఁ గోరదునాకిక నేగిదిక్కు పా
వనమగు నీదుమంత్రము శుభంబొనగూర్పదె? వెంకటేశ్వరా॥ 93

చం. కరిపతి యాసుయోధనుడు గాఢవిరోధముపూని ద్రౌపదిన్
బరమపతివ్రతామణి సభాస్థలిఁ వస్త్రవిహీనఁ జేయగా
హరి! కమలాక్ష! దిక్కురితి నార్తను మానమురక్షసేయు మ
న్మొఱవినివల్వలీయవె యమోఘముగాపడి వెంకటేశ్వరా॥ 94

ఉ. కోతులచేమహాబ్ధినటు గూర్చితి సేతువు, గడ్డిపోచ వి
ఖ్యాతిగ బ్రహ్మసాయక మొనర్చితి వెంతయుఁ నొక్కతూపునన్
బ్రాతిగ సప్తతాళములఁ భంగమొనర్చితి నబ్బురంబుగా
నాతరమానుతింపనిను నవ్యమృదూక్తుల వెంకటేశ్వరా॥ 95

చం. రవిసుతుగోడుమాన్ప సురరాజసుతుంబరిమార్చి తొంటిమై
దివిరిని శాతబాణమున తేజమెలర్పగఁ; గీశసంఘముల్
దవిలిభజింప వారి నిధి దాటి నిశాటుని రూపుమాపితో
పవిధర ముఖ్యవందిత విభావశుభాకర! వెంకటేశ్వరా॥ 96

కాపొర్కానుచీకటింగనులు కానని భంగియ విద్యతాను సం
పర్కముకల్గు మూఢగుణమానితుడెంతయుఁ గానలేడు వి
ద్యార్క వికాసనుస్థిర మహామహిమాస్పద జ్ఞానచక్షువున్
తర్కములెన్ని చేసినను దానవమర్దన వెంకటేశ్వరా॥ 97

ఉ. కారణకారణుండ! త్రిజగత్పతి! భక్తజనైకపోషణా!
వారినిధిప్రవిష్ట! యహివల్లభభోగశయాన! లోకసం
వారసముద్భవస్థితినివారణకార్యకలాప! సంతతా
పారదయాంతరంగ! బుధపాలన! తిర్పతి వెంకటేశ్వరా॥ 98

ఉ. సేతువుదొట్టి శీతనగసింధుసమావృత భారతావనిన్
ఖ్యాతినిఁగన్నతీర్థముల గారవమొప్ప మునింగి తద్గతా
త్యాతత దేవదర్శనము సాదృతిమై బొనరించి పాపసం
ఘాతమడంచు మానవుడు ఖండితదానవ! వెంకటేశ్వరా॥ 99

ఉ. కన్నులకర్వదీర పులకాన్వితమై తనువుల్లసిల్లగా
నెన్నగరాని కోర్కెలుదయింపగ మానసమందు సంతతా
భ్యున్నతి హేతుకంబయి నపూజ్యమనోహరమూర్తిఁ జూపుమో
పన్నగతల్ప! భక్తసురపాదప! తిర్పతి వెంకటేశ్వరా॥ 100

ఉ. పన్నగనాథు తల్పమునఁ బాలసముద్రమునందు లచ్చి క
న్నన్నల మోదముంగనుచు సారసగర్భ ముఖామరాళిని
న్నన్నుతిసేయ లోకములఁ జక్కగఁ బ్రోచెడులోకపాల! న
న్నన్నకుమారునైవడిని కావుము తిర్పతి వెంకటేశ్వరా॥ 101

చం. పుడమినికల్గుమానవ సమూహము నిత్యమునీపదాత్రయిం
బడిభవదీయ చింతనము మానసమందున చేరనీయకం
బడిశము పాల్పడందనరు మత్స్యముపోల్కి నిరంతరంబుఁ దా
జెడుభవబంధదుఃఖములఁ జేష్పడిపీడక వెంకటేశ్వరా॥ 102

ఉ. ఎన్నిభవంబులొందితినొ యెందరు దారలుపుత్రులైరొ యిం
కెన్నియొ జన్మకోటులను నేను నిరంతరగర్భవాస మ
న్నన్నము నొందగావలెనొ భారము నీ పదపద్మయుగ్మముం
దిన్నగఁ జేర్చికొల్చెదను తీర్పవె నావ్యథ వెంకటేశ్వరా॥ 103

చం. ధనమదినిత్యమ్ముగమిగులఁ దాచిననేనియు నాశమొందు నా
రనికడగండ్లఁగూర్చు, పగ రంజిలు గుప్తివిచారహేతువా
కనికరమార్తకోటిదెసఁ గల్గగనీదు విరాగమెప్పుడుం
గనగనసాధ్యమా మనముఁ గారియ పెట్టును వెంకటేశ్వరా॥ 104

ఉ. పుట్టుకతోనహంకృతియుఁ బొల్చునువీడదు జీవితాంతమున్
కట్టెడి కార్యముల్ సలుపుఁ గాంచగనీయదు మంచిచెడ్డలన్
చిట్టలు దానిచర్యలటుఁ జిందవందర చేయుమానసం
బెట్టులవీక్షణంగలనొ యీమదిష్ఠను వెంకటేశ్వరా॥ 105

ఉ. సత్పథదాయి! లోకములఁ సర్గముపాలన సంహృతిన్విలా
సోత్పథలీలఁ జేయుచు నిజోరుమహత్త్వమునన్సురారిసం
పత్పతనంబొనర్చునినుఁ బ్రస్తుతిఁ జేసెద చిత్తగింపుమీ
యుత్పలచంపకప్రసవయోజితమాలల వెంకటేశ్వరా॥ 106

చం. శతకమనంగనూరగును చాలగనెన్మిదిఁ జెప్పినంతనే
శతకముపైన నష్టకముఁ జానగు, నట్టులఁగూర్చి చెప్పితిన్
అతితరభక్తిభావమున నబ్జవిలోచన! నీపదంబులే
గతియనినమ్మి, నాకృతినిఁ గైకొని బ్రోవుము వెంకటేశ్వరా॥ 107

ఉ. రేపలితాలూకాను గల శ్రీసిరిపూడినివాసి, నారువేల్
బాపలశాఖలోఁగడుఁ జెలంగితి యల్లయప్రగ్గడాఖ్యతో
రూపగువంశమందు, చతురుండనఁ బేరుసుబ్బరాయడన్
ప్రాపునొసంగి బ్రోవగదె పద్మవిలోచన వెంకటేశ్వరా॥ 108

—హరిః ఓం తత్సత్—

భారతీప్రెస్, తెనాలి. 1949

ఈ గ్రంథకర్తగారిచే రచింపబడిన గ్రంథములు

1. శ్రీ సీతారామ శతకము (అచ్చయి వున్నది)
2. శ్రీ వెంకటేశ్వర శతకము ,,
3. శ్రీ మల్లిఖార్జున శతకము (అచ్చులోనున్నది)
4. శ్రీ నరసింహ శతకము ,,
5. శ్రీ రుక్మిణీవిజయము (ప్రబంధము) ,,
6. శ్రీ ఆంజనేయ శతకము ,,
7. ఖండకావ్యముల సంపుటి ,,
8. రామేశ్వర యాత్ర ,,
9. ఘటికాచలక్షేత్ర మహాత్మ్యము ,,

దొరకుతావు:

యల్లాప్రగడ వెంకటసుబ్బారావు

సిరిపూడి (రేపల్లె తాలూకా)

13577